

కిలో టమోటా రూ. 67.70

పుంగనూరు, జూలై 16: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టమోటా ధరలకు రెక్కలొచ్చాయి. పుంగ నూరు మార్కెట్‌కు రైతులు 284.25 మెట్రిక్ టన్నుల టమోటాను తీసుకొచ్చారు. నాణ్యమైన మొదటి రకం కిలో టమోటా రూ.67.70, రెండో రకం రూ.64, మూడోరకం కిలో రూ.60 చొప్పన ధర పలికింది. ఈసీజన్‌లో ఇదే అత్యధిక ధర. ఇటీవల వర్షం, తెగుళ్లతో తమిళనాడు, ఇతర ప్రాంతాల్లో పంటదిగుబడి పడిపోయింది. దీంతో ఇతర ప్రాంతాల్లోని వ్యాపారులు పుంగనూరు, సమీపప్రాంత మార్కెట్లో టమోటాలు కొనుగోలు చేసి తమిళనాడు,కేరళతో బాటు మన రాష్ట్రంలో డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధరల పెరగడంపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

కుప్పం రైతులకు ఊరట



- 'మిగులు భూమి' కింద 4వేలకుపైగా సర్వే నెంబర్లు
- కలెక్టర్ చొరవతో పరిష్కార దిశగా అడుగులు
- తొలివిడతలో 800 ఎకరాలకుపైగా క్లియరెన్స్‌కు చర్యలు

చిత్తూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని పలు గ్రామాల్లో రైతుల దీర్ఘకాలిక సమస్య పరిష్కారం అవుతోంది. సుమారు 2500 మంది రైతుల భూముల్ని గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు 'మిగులు భూములు' కింద వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేశారు. అప్పటి నుంచి వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు మాత్రం అప్పటి రెవెన్యూ అధికారులకు అంతో ఇంతో సమర్పించుకుని, రాజకీయ పలుకుబడితో మిగులు భూమి అని తొలగించుకున్నారు. మిగిలిన రైతులకు మాత్రం వెబ్‌ల్యాండ్‌లో మిగులు భూమి అని ఉండడంతో రీసర్వేకు, బ్యాంకుల్లో రుణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కుప్పంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటుచేసి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. వచ్చిన వాటిలో సింహభాగం అర్జీలు మిగులు భూముల గురించే ఉన్నాయి. దీనిపై ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటుచేసి విచారించారు. మొత్తం 4 వేలకుపైగా సర్వే నెంబర్లలోని 2500 మంది రైతుల భూముల్ని మిగులు భూములుగా నమోదు చేసినట్లు గుర్తించారు. దీంతో తొలి విడతలో 909 సర్వే నెంబర్లలోని 800 ఎకరాలకుపైగా భూమికి క్లియరెన్సు కోసం జేసీ శ్రీనివాసులుకు ప్రతిపాదన వచ్చింది. జేసీ ఉత్తర్వుల మేరకు కుప్పం తహసీల్దార్ నేడో రేపో వెబ్‌ల్యాండ్‌లో పట్టా భూములుగా మార్పు చేయనున్నారు. మిగిలిన సర్వే నెంబర్ల గురించి క్షేత్ర స్థాయిలో విచారణ జరుగుతోంది. మలి విడతలో ఆ భూముల్ని కూడా పట్టాగా మార్పు చేయనున్నారు. తొలి విడతలో చలార్లపల్లె 10.37 ఎకరాలు, ఉరినాయని కొత్తూరు 4.60 ఎకరాలు, కూర్మానిపల్లె 20.10, అడవిబుదుగూరు 29.55, అడవిములకలపల్లె 11.97, నూలకుంట్ల 9.86, కుప్పం 7.44, టి.సదమూరు 17.45, కంగుంది 42.05, కతిమానిపల్లె 2.65, పొన్నగూరు 27.71, గుండ్లనయనపల్లె 6.08, కాకిమడుగు 18.87, పొరకుంట్లపల్లె 6.43, కంగుంది రిజర్వు ఫారెస్టు 392.59, కనమపచర్లపల్లె 32.43, నడిమూరు 31.46, సీగలపల్లె 6.40, చిన్నకురబలపల్లె 1.69, ఏకర్లపల్లె 36.15, సామగుట్టపల్లె 5.38, ఎలజనూరు 0.15, పలార్లపల్లె 3.85, చిన్నవోబ్బ 40 ఎకరాలకు క్లియరెన్సు ఇచ్చేసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయనున్నారు. మిగులు భూములు అని తొలగిస్తే ఆ రైతులకూ లబ్ధి కలుగుతుంది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

సీడీసీఎంఎస్‌లో 'లెక్క'లేనితనంపై
వివరణ ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్) పరిధిలో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై వివరణ ఇవ్వాలని సొసైటీ బిజినెస్ మేనేజర్ వై.శ్రీధర్‌ను డీసీవో నాగవర్ధన ఆదేశించారు. 'సీడీసీఎంఎస్‌లో 'లెక్క'లేనితనం' అంటూ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆ సంస్థ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ డీసీవో కార్యాలయానికి ఫైళ్లతో వెళ్లి రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో డీసీవో మాట్లాడుతూ.. వారం వ్యవధిలో ప్రచురితమైన డీసీసీబీలో 'దా'రుణాలు, అక్రమాలకు సింగిల్ విండో, సీడీసీఎంఎస్‌లో లెక్కలేనితనం వార్తలపై డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్, సీడీసీఎంఎస్ డీఎం శ్రీధర్ నుంచి సమగ్ర వివరణ తెప్పిస్తున్నామని చెప్పారు. వాటిని సంస్థల పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ శ్రీనివాసులుకు అందజేస్తామన్నారు. జేసీ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.





రెండేళ్ల కిందట అక్రమ క్వారీలను పరిశీలిస్తున్న చంద్రబాబు

480 ఎకరాల్లో 120 అక్రమ క్వారీలు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

క్వారీల నిర్వహణ.. మామూళ్ల వసూలు తీరు

శాంతిపురం మండలం సి.బండపల్లె పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ అక్రమ క్వారీల నిర్వహణ తీరు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. మొత్తం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లో సాగింది. ఆయనతో పాటు స్థానిక ఎమ్మెల్సీ భరత్ కూడా వీటితో లబ్ధి పొందారన్నది బహిరంగ రహస్యం. ఇక్కడ సుమారు 120 క్వారీలు నడిచాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు వీటిని నిర్వహించుకున్నారు. ఒక్కో క్వారీ తీసుకోవాలంటే రూ.10 లక్షలు డిపాజిట్ (నాన్ రీఫండబుల్) చేయాలి. ఆ తర్వాత నెలకు క్వారీల స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు మామూళ్లు ఇవ్వాలి. ఇలా నెలకు రూ.2 కోట్లు వైసీపీ నాయకులకు చేరేవని ఆరోపణలున్నాయి. ఇక డిపాజిట్లు రూ.12 కోట్లు అద నం. ఇలా సుమారు 30 నెలల పాటు ఈ అక్రమ వ్యాపారం జరిగింది. వైసీపీ నాయకులకు మామూళ్ల రూపంలో రూ.వంద కోట్ల వరకు అందింది. మొత్తంగా ఇక్కడ రూ.500 కోట్ల అక్రమం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు గ్రానైట్ రాళ్లను కొల్లగొట్టారు. ఈ అక్రమ సంపాద నుంచే నాటి కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నేతలు ఓటుకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేశారన్న ఆరోపణలున్నాయి. అధికార దుర్వినియోగం.. అక్రమ సొమ్ము పంచి మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారు.

ఈ ప్రాంతాల్లోనే అక్రమ క్వారీలు

శాంతిపురం మండలం సి.బండపల్లె పంచాయతీ, 81 ముద్దనపల్లె రెవెన్యూ గ్రామం 104 సర్వే నంబరులో 252 ఎకరాలున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో అడవి అని ఉంది. ఇక్కడ సుమారు 40 క్వారీలు అక్రమంగా నడిచాయి. 213 సర్వే నెంబరులో సుమారు 150 ఎకరాలుండగా.. రికార్డుల్లో పశువుల మేత బీడుగా ఉంది. ఇక్కడ కూడా 30 క్వారీల వరకు నడిచాయి. సుమారు 150 ఎకరాల ద్రవిడ వర్సిటీ స్థలంలోనూ 20 క్వారీలను నిర్వహించారు. గెనికపల్లె రెవెన్యూ గ్రామం, చిన్నూరు 284 సర్వే నెంబరులోని 24 ఎకరాల్లో 3 క్వారీలు నడిచాయి. 64.పెద్దూరు పంచాయతీలో గ్రామ సమీపంలోనే రైతులను బెదిరించి వారి పొలాల్లో 20 క్వారీలను నిర్వహించారు.

ఒకటీ అరా కాదు.. దాదాపు 480 ఎకరాల్లో 120కిపైగా అక్రమ క్వారీలు నిర్వహించారు. వైసీపీ పాలనలో కొండలను పిండిచేసి.. సుమారు రూ.500 కోట్ల దోపిడీ జరిగినట్లు అంచనా. నాడు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఈ అక్రమ క్వారీలను పరిశీలించారు. చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. తర్వాత కూడా ఈ అక్రమ క్వారీలూ ఆగలేదు. ఇప్పుడు చంద్రబాబు సీఎం కావడంతో కుప్పం నియోజకవర్గంలోని అక్రమ క్వారీల్లో భాగస్వాములైన వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

- రూ.500 కోట్ల దోపిడీ జరిగిందని అంచనా
- 2022లో చంద్రబాబు తనిఖీలతో వెలుగులోకి..
- కూటమి ప్రభుత్వం విచారణ చేస్తుందని అక్రమార్కుల్లో భయాందోళన

కుప్పంలో 2022 జనవరిలో చంద్రబాబు మూడు రోజుల పాటు పర్యటించారు. చివరి రోజైన 8వ తేది శాంతిపురం మండలం సి.బండపల్లెలో పర్యటిస్తుండగా.. స్థానిక టీడీపీ నాయకులు అక్రమ క్వారీల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించాలని కోరారు. దీంతో ఆయన గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న కొండల్ని ఎక్కి అక్రమ క్వారీలను చూశారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర కొండల్లో, గుట్టల్లో పర్యటించారు. దశాబ్దాలుగా ఇక్కడ ఎమ్మెల్యేగా, సీఎంగా, ప్రతిపక్ష నేతగా ఉన్నా తానెప్పుడూ ఇలాంటి అక్రమాలకు సహకరించలేదని గుర్తు చేశారు. గ్రీన్ ట్రైబ్యునల్, కేంద్రం, కోర్టుల దృష్టికి తీసుకెళ్లి ప్రక్షాళన చేస్తానన్నారు. అనుకున్నట్టే గ్రీన్ ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. చంద్రబాబు తనిఖీలు చేయడంతో నేషనల్ మీడియా దృష్టికి చేరింది. ఇందులో హస్తమున్న పెద్దిరెడ్డి సహా కుప్పం వైసీపీ నాయకుల అవినీతి బండారం బయటపడింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో ఆ అక్రమ క్వారీలలో భాగస్వాములైన వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. ఎక్కడ విచారణ జరుగుతుందోనని భయపడుతున్నారు.

వంత పాడిన అధికారులు

ఈ అక్రమ క్వారీల వెనుక పెద్దిరెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు ఉన్నారని తెలిసి సంబంధిత మైన్స్, రెవెన్యూ, అటవీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ అక్రమ క్వారీల నిర్వహణకు వంత పాడారు. స్థానిక టీడీపీ నాయకులు ఎన్నిసార్లు నేరుగా, ఫోనులో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మైన్స్ వాళ్లయితే ముందస్తు సమాచారం ఇచ్చి నామమాత్రంగా దాడులు చేసి, ఒక ట్రెండు బ్లాకులు సీజ్ చేసి వెళ్లిపోయేవారని అప్పట్లో విమర్శలున్నాయి.



వేలంపాట నిర్వహిస్తున్న మండీ యజమానులు

నీలం రకం మామిడి టన్ను రూ.90 వేలు

బంగారుపాళ్యం, జూలై 16: బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు బుధవారం రైతులు తరలించిన మేలైన నీలం రకం మామిడి కేజీ రూ.90 ధర పలికింది. అలాగే మేలైన టేబుల్ రకమైన తోతాపురి రూ.45 పలికింది. అలాగే గుజ్జుపరిశ్రమకు తరలించే మామిడి కేజీ రూ.20 పలికింది. వ్యాపారస్థులు వేలం పాటలో దక్కించుకుని చెన్నై, బెంగుళూరు, ఒరిస్సా, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అంతంతమాత్రమే ఉండడంతో అధిక ధరలు ఉన్నాయని రైతులు అంటున్నారు.

59.47 కిలోల గంజాయి పట్టివేత

- పుంగనూరులో ఆరుగురి అరెస్టు



గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న డీఎస్పీ విష్ణురఘువీర్

పుంగనూరు, జూలై 16: పుంగనూరులో అంతరాష్ట్ర గంజాయి ముఠా నుంచి రూ.5,94,700 విలువ చేసే 59.470 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను మంగళవారం రాత్రి పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ మీడియాకు వెల్లడించారు. ఒడిసా నుంచి గంజాయి పుంగనూరుకు చేరి వివిధ ప్రాంతాలకు తరలుతోందన్నారు. డీఎస్పీ తెలిపిన ప్రకారం.. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడి న విజయవాడ మల్లికార్జునపేటలోని ఆది నారాయణ కుమారుడు బి.శివనాగేశ్వరరావు, పుంగనూరు భగత్‌సింగ్‌కాలనీకి చెందిన డ్రైవర్ రవికి బెంగళూరు జైలులో పరిచయం ఏర్పడింది. అనంతరం వీరు గంజాయి అక్రమరవాణాకు ఒక ముఠాను సిద్ధం చేశారు. పుంగనూరు భగత్‌సింగ్ కాలనీలోని ఆటో డ్రైవర్ నవీద్ అహ్మద్ ఇంట్లో గంజాయి ఉన్నట్లు మంగళవారం ఉదయం సీఐ జయరామయ్యకు సమాచారం వచ్చింది. సిబ్బందితో కలిసి ఆ ఇంట్లో పరిశీలించగా 59.470 కిలోల గంజాయి.. 29 ప్యాకెట్లలో ఉండగా స్వాధీనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన బి.శివనాగేశ్వరరావు(25), పుంగనూరు భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఆవుల లక్ష్మన్న కుమారుడు రవి(27), మహ్మద్ ఇలియాస్ కుమారుడు ఆటో డ్రైవర్ నవీన్ అహ్మద్(40), ఒడిసాకు చెందిన ఎస్.కన్హర్(24), పలమనేరు నెహ్రూ నగర్‌కు చెందిన జి.నాగరాజ కుమారులు జి.గిరి(37), జి.నవీన్(25)ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయికి తహసీల్దార్ జి.శివయ్య పంచనామా చేశారు. కాగా, గంజాయి కేసు చేధించడంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన పుంగనూరు సీఐ జయరామయ్య, ఏఎస్ఐ జయచంద్ర, హెచ్‌సీ ఢిల్లీకుమార్, కానిస్టేబుళ్ల రెడ్డెప్ప, ఎల్లప్ప, చిప్పరెడ్డెప్ప, ప్రకాశ్, రమణను ఎస్పీ మణికంఠ ప్రశంసించినట్లు డీఎస్పీ విష్ణురఘువీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా నుంచి తీసుకొచ్చి..

ఒడిశా నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్‌లో రేణిగుంటకు గంజాయి తీసుకొస్తారు. అక్కడ్నుంచి బస్సులో పుంగనూరుకు చేరుస్తారు. ఆ తర్వాత పట్టణంలోని వివిధ ప్రాంతాలకు, బెంగళూరు, తమిళనాడుకు గంజాయి తీసుకెళతారు. కాగా, జైలులో పరిచయం వల్ల శివనాగేశ్వరరావు దాదాపు రెండు నెలలుగా పుంగనూరులో రవి బంధువుల ఇంట్లో ఉన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి రవాణా, అమ్మకాల కోసం ఆరుగురు ముఠాగా ఏర్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఒంటరి ఏనుగు స్వైర విహారం

సోమల, జూలై 16: సోమల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల మంద రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈనేపథ్యంలోనే మంద నుంచి దారితప్పిన ఒంటరి ఏనుగు ఆవుల పల్లె పంచాయతీ రాంపల్లె బీట్‌లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తోందని రైతులు వాపోతున్నారు. సోమవారం రాత్రి రాంపల్లె, కొత్తూరు వద్ద మామిడి తోటలో చెట్లను, డ్రిప్ పరికరాలను విరి చేసింది. టమోటా తోటలను వరినార్లను తొక్కేసింది. పేటూరు సమీప కనికల చెరువు వద్ద ఏనుగుల మంద సంచరిస్తోందని రైతులు తెలిపారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



పలమనేరు, జూలై 16: తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితంగా ఇస్తోంది. అయినా, పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్లే.. ఇప్పుడూ ఇసుక తరలిస్తున్నాయి. నాడు వైసీపీ పేరు చెప్పిన అక్రమార్కులు.. ఇప్పుడు అధికార పార్టీ పేరు చెబుతుండటం గమనార్హం. పట్టపగలే కౌండిన్య నది చెక్‌డ్యామ్‌ల వద్ద ఇసుక తోడేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పలమనేరు, గంగవరం మండలాల్లో ఇసుక అవసరమైన వారు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో నాలుగురోడ్ల వద్ద ఉన్న ఇసుక డంప్ వెళ్లాలి. ఇది అసౌకర్యంగా ఉన్నందున అందరూ ఇసుక అక్రమ రవాణాదారులపైనే ఆధారపడుతున్నారు. అందుకని పలమనేరు, గంగవరం వద్దే ఇసుక డంప్ ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు. కాగా, వైసీపీ హయాంలో కర్ణాటక సరిహద్దుకు కేవలం 5 కిలోమీటర్ల ముందే నాలుగు రోడ్ల కూడలి వద్ద ఇసుక డంప్ ఏర్పాటు చేశారు. అక్కడ్నుంచి సరిహద్దు దాటించేందుకు అనువుగా ఉంటుందని అప్పట్లో నాలుగు రోడ్ల కూడలిని ఎంచుకున్నారు. అక్కడ్నుంచి ఇసుక తరలించాలంటే ట్రాక్టరు అద్దె రూ.1500 అవుతుందని స్థానికులు అంటున్నారు.

టీడీపీ వైపు తిరిగితే చంపేస్తాం

- మూడు నెలల కిందట అడ్వకేట్‌కు బెదిరింపులు
- అప్పట్లో కేసు నమోదు చేయని పోలీసులు
- కోర్టు ఆదేశాలతో ప్రస్తుతం పీకేయూ ఉడా మాజీ ఛైర్మన్ సహా ఆరుగురిపై కేసు

పుంగనూరు, జూలై 16: తెలుగుదేశం పార్టీకి పనిచేస్తే చంపేస్తామని పుంగనూరు టీడీపీ నేత, అడ్వకేట్ ఎల్.నవీన్‌ను ఫోన్‌లో దుర్భాషలాడారంటూ పీకేయూ ఉడా మాజీ ఛైర్మన్ ఎన్.వెంకటరెడ్డి యాదవ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. 'ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేది కొంతమంది ఫోన్లు చేసి కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు.ఎన్నికల్లో టీడీపీ వైపు తిరగరాదని, వైసీపీ నేత వెంకటరెడ్డి యాదవ్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దాడి చేసినా మార్పు రాకపోవడంతో ఇక చంపేస్తామని వివిధ నెంబర్ల ద్వారా ఫోన్ చేసి బెదిరించారు. దీనిపై అప్పట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. నాకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించగా..న్యాయమూర్తి ఆదేశాలతో పుంగనూరు పోలీసులు క్రైం నెంబరు 318/24 మేరకు కేసు నమోదు చేశారు' అని ఎల్.నవీన్ మంగళవారం మీడియాకు వివరించారు. తనను బెదిరించి, దుర్భాషలాడిన వైసీపీకి చెందిన ఎన్.వెంకటరెడ్డి యాదవ్, ప్రవీణ్ అలియాస్ చిన్న, బి.రమేశ్, బి.వెంకటరెడ్డి, కె.వెంకట్రమణ, సాయిరెడ్డి అలియాస్ టి.జగదీశ్‌రెడ్డిపై కేసు నమోదు చేశారన్నారు.


తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో డీటీని విచారిస్తున్న సీఐడీ అధికారులు

రంగంలోకి సీఐడీ !

తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో విచారణ

ఓటర్ల నమోదులో అక్రమాలపై ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు పర్యవసానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మంగళవారం విచారణ జరపడం కలకలం రేపింది.చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే పులివర్తి నానీ చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచీ అసంఖ్యాకంగా ఫిర్యాదులందాయి. కలెక్టర్ మొదలుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ దాకా ఫిర్యాదులు వెళ్ళాయి. తిరుపతి ఆర్డీవో నుంచీ కిందిస్థాయిలో బీఎల్వోల దాకా అధికారులు, సిబ్బంది అప్పటి అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దొంగ ఓట్లు భారీగా చేర్పించారని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆధారాలు కూడా జత చేశారు. అయితే ప్రభుత్వం వీటిపై స్పందించలేదు. ఎన్నికల సంఘం వివరణ కోరినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపుచ్చారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలు ముగిశాక ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీ మళ్ళీ దీనిపై ప్రభుత్వానికి, సీఐడీ విభాగానికీ ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి గూడూరు ఆర్డీవో మీసాల కిరణ్ కుమార్ ప్రమేయంపై ఆరోపణలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో అంటకాగారనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చాక ప్రభుత్వ విప్ హోదాలో చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు.తర్వాత గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూనే వారంలో ఐదు రోజుల పాటు తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో వున్న చెవిరెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో మకాం వేసేవారని, చంద్రగిరి పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లను, తిరుపతి ఆర్డీవోను అక్కడికి పిలిపించుకుని బోగస్ ఓటర్లను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్డీవో, తహసిల్దార్ల లాగిన్ల పాస్‌వర్డులు తీసుకుని బోగస్ ఓటర్లను చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల స్వాధీనం

ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు నేపథ్యంలో తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామ్‌కిషోర్, ఎస్‌ఐ మంజుల, సిబ్బంది మంగళవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. అయితే ఆ సమయానికి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కార్యాలయంలో లేరు. కార్యాలయ ఏవో, ఎన్నికల డీటీలను విచారించిన సీఐడీ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో కలెక్టరేట్‌కు వెళ్ళారని, సాయంత్రం వస్తారని సిబ్బంది చెప్పడంతో సీఐడీ అధికారులు మళ్ళీ సాయంత్రం కార్యాలయానికి వెళ్ళారు. అయితే అప్పుడు కూడా ఆర్డీవో లేరు. క్యాంపు వెళ్ళారని, బుధవారం సెలవు కనుక గురువారం అందుబాటులో వుంటారని సిబ్బంది చెప్పారు. దీంతో గత ఐదేళ్ళలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన అధికారులు, డివిజన్ పరిధిలో పనిచేసిన తహసిల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, ఆర్డీవో, తహసిల్దారు కార్యాలయాల్లో పనిచేసిన ఎన్నికల సిబ్బంది ఎవరనే వివరాలు అందజేయాలని సీఐడీ అధికారులు కార్యాలయ ఏవోకు లేఖ అందజేశారు. చెవిరెడ్డి ఓఎస్డీగా కిరణ్‌కుమార్ తుడా వ్యవహారాల్లో ఏవైనా జోక్యం చేసుకున్నారా? నిధుల దుర్వినియోగంలో ఆయన ప్రమేయం ఏమైనా వుందా? అన్న కోణంలో విచారించేందుకు తుడా కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ తుడా వీసీ వెంకట నారాయణను విచారించారు. అయితే చెవిరెడ్డికి ప్రభుత్వ విప్ హోదాలో కిరణ్‌కుమార్ ఓఎస్డీగా పనిచేశారు తప్ప తుడాతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, తుడా వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఏమీ లేదని వీసీ సమాధానమిచ్చినట్టు తెలిసింది.


తుడా కార్యాలయంలో వీసీతో చర్చిస్తున్న సీఐడీ బృందం

రేపు తిరుపతి ఆర్డీవోను విచారించే అవకాశం?

తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి మంగళవారం అందుబాటులో లేకపోవడంతో గురువారం ఆయనను సీఐడీ అధికారులు విచారించే అవకాశం వుంది. అయితే గురువారం అయినా ఆయన అందుబాటులోకి వస్తారా లేదా? అందుబాటులోకి రాకుంటే సీఐడీ అధికారులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సి వుంది. కాగా చంద్రగిరి నియోజకవర్గంలో బోగస్ ఓటర్లను పెద్ద సంఖ్యలో చేర్పించారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారుల విచారణ మొదలు కావడంతో ఎన్నికల విధుల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు. తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందో, తమపై ఏం చర్యలు వుంటాయోనని ఆందోళనకు లోనవుతున్నారు.



టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారిగా సీహెచ్ వెంకయ్య చౌదరి నియమితులయ్యారు.2005వ సంవత్సరం బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారైన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన మూడేళ్ల పాటు ఏపీలో పనిచేయనున్నారు. గతంలో ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా వెంకయ్య చౌదరి పనిచేశారు. సాధారణంగా టీటీడీకి ఈవోతో పాటు తిరుమలకు ఒకరు, తిరుపతికి ఒకరు చొప్పున ఇద్దరు జేఈవోలుంటారు. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఇద్దరు జేఈవోలను తిరుపతికే పరిమితం చేసి తిరుమలలో కేవలం ఈవోగా ధర్మారెడ్డిని మాత్రమే కొనసాగించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పూర్వపు పద్ధతిలోనే ఈవోతో పాటు తిరుమలకు జేఈవోను యధావిధిగా కొనసాగిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సమర్థవంతమైన అధికారిగా పేరున్న వెంకయ్య చౌదరి ఎంట్రీతో టీటీడీలో ఎలాంటి మార్పులు, ఒటాయో చూడాల్సివుంది.

అంకెల గారడీ వద్దు... కొత్తవారిని గుర్తించి రుణాలివ్వండి

● బ్యాంకర్లకు కలెక్టర్ పిలుపు


బ్యాంకర్లకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16: లక్ష్యాలు పూర్తి చేశామంటూ చూపించే అంకెల గారడీ వద్దు.... రుణాల కోసం ఎదురుచూస్తున్న కొత్తవారిని గుర్తించి రుణాలు అందించి ఆదుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌సాగుకు సంబంధించి రైతులకు, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఐదు లక్షల మంది రైతులు ఉన్నారని, వీరికి సాగుతో పాటు విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువుల కొనుగోళ్ళకు అవసరమైన రుణపరపతిని అందించాలని హితవు పలికారు. వ్యవసాయంతో పాటు జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతోందని, పాడి పశువుల కొనుగోళ్ళకు సైతం విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. బ్యాంకర్ల సమావేశానికి ప్రతి బ్యాంకు తరఫున జోనల్ మేనేజర్ లేదా రీజనల్ మేనేజర్లు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ఎల్డీఎం హరీష్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యానికి మించి 106.62 శాతం రుణాలు బ్యాంకర్లు పంపిణీ చేశారని వివరించారు. ఎంఎస్ఎంఈకి సంబంధించి లక్ష్యాలకు మించి రుణాలు అందించామని పేర్కొన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం సునీల్, ఆర్బీఐ లీడ్ బ్యాంక్ ఆఫీసర్ నాగప్రదీప్, ఇండియన్ బ్యాంకు జెడ్ఎం బాలచంద్రమోహన్, ఇతర బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, కోఆర్డినేటర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి గడ్కరీ రాక

తిరుపతి (కలెక్టరేట్), జూలై 16: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ జాతీయ రహదారుల ప్రాజెక్టులపై అధికారులతో చర్చించనున్నారు. తర్వాత హెలికాప్టర్‌లో మదనపల్లి బయలుదేరుతారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొన్నాక రాత్రి తిరుమల చేరుకుంటారు. గురువారం వేకువజామున శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఢిల్లీ బయలుదేరుతారని కలెక్టర్ వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది.

కుప్పంలో రేపు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూలై 16: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లిగుండ్లపల్లెలో బెల్జియం విద్యార్థుల బృందం


బెల్జియం విద్యార్థులకు అన్నదానం చేస్తున్న గుణశేఖర్ నాయుడు

శ్రీరంగరాజపురం, జూలై 16: బెల్జియం దేశానికి చెందిన 27మంది విద్యార్థుల బృందం ఎస్ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లె ఎస్టీ కాలనీలో మంగళవారం పర్యటించింది. ప్రకృతి నుంచే వచ్చే వివిధ మూలికల గురించి, ఎస్టీ కాలనీ ప్రజల ఆహార అలవాట్లు, వారి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లిగుండ్లపల్లె గ్రామానికి చెందిన వాటర్ షెడ్ మాజీ చైర్మన్ గుణశేఖర్ నాయుడు, ఆయన కుమారుడు మోహన్ ప్రసాద్ బెల్జియం విద్యార్థులకు అన్నదానం చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సోషియల్ వర్కర్ సిద్దమ్మ భారతదేశ గ్రామీణ ప్రాంతాల గురించి వారికి వివరించారు.

లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు


నిందితుడు రామయ్య

పుత్తూరు అర్బన్, జూలై 16: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన సోమవారం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రామయ్య 2020 ఏప్రిల్ 20వ తేదీన ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్. శాంతి సోమవారం నిందితుడు రామయ్యకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసును స్పెషల్ పీపీ శైలజ బాధితుల తరఫున వాదించారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడడానికి కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ పట్టాభి, సబ్ డివిజన్ కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణమరాజును డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

ననియాల ఎలిఫెంట్ క్యాంపు సందర్శన


శిక్షణ పొందిన ఏనుగులను పరిశీలిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

రామకుప్పం, జూలై 16: రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంపును మంగళవారం అనంతపురం అటవీ రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు సందర్శించారు. ఎలిఫెంట్ క్యాంపుతో బాటూ, అక్కడి ఎకో టూరిజం పార్కును కూడా సందర్శించారు. ఏనుగుల సంరక్షణపై అక్కడి సిబ్బందికి సూచనలిచ్చారు. అదేవిధంగా వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణకు చేపట్టాల్సిన పనులపై స్థానిక అటవీ అధికారులతో చర్చించారు. స్థానికుల అభిప్రాయాలకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కుప్పం అటవీ రేంజ్ పరిధిలో జరుగుతున్న పనుల తీరుపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు కుప్పం మండలం నడుమూరు బేటరాయస్వామి కొండను ఆయన సందర్శించారు. అక్కడ ఎకో టూరిజం పార్కు ఏర్పాటుపై సీఎం పీఏ మనోహర్, స్థానిక టీడీపీ నేతలతో చర్చించారు. ఆయన వెంట డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీపీ సహా ఎంపీటీసీలెవరూ రాలేదు

● వచ్చింది నలుగురు సర్పంచులే.. వాయిదా పడ్డ పులిచెర్ల మండల మీట్


ప్రజాప్రతినిధులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కల్లూరు, జూలై 16: జడ్పీటీసీ సహా నలుగురు ఎంపీటీసీలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన పులిచెర్ల మండల మీట్‌కు ఎంపీపీ సహా ఎంపీటీసీ సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో సమావేశానికి ఎంపీడీవో సురేష్‌బాబు వాయిదా వేశారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, 8 మంది ఎంపీటీసీ సభ్యులు మండల సమావేశానికి హాజరుకాలేదు. సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మునిరత్నం, కృష్ణయ్య రాగా.. మిగతా వాళ్లు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం ప్రారంభించాల్సిన సమయం ముగిసిపోవడంతో మండల మీట్ వాయిదా పడింది. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, ఏపీవో షౌకత్ అలీ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసీపీకి ముగ్గురు ఎంపీటీసీల రాజీనామా

కాగా, మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 9 మంది వైసీపీ.. ఇద్దరు టీడీపీ సభ్యులు ఉన్నారు. దేవళంపేట ఎంపీటీసీ సురేంద్రనాధరెడ్డిని ఎంపీపీ పదవి వరించగా పులిచెర్ల, మంగళంపేట సభ్యులు ఈశ్వరి, రాశి వైస్ ఎంపీపీలుగా ఎంపికయ్యారు. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమితో మూడు రోజుల క్రితం నలుగురు ఎంపీటీసీలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ ప్రభావం మండల మీట్‌పై పడింది.

పుష్పపల్లకిలో మురిపించిన మలయప్ప

శ్రీరంగం సారె సమర్పణలో కొంత గందరగోళం



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరుమలలో పుష్పపల్లకి సేవ కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిసి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను స్వామివారి పల్లకి అలంకరణకు వినియోగించారు. కృత, త్రేతా, ద్వాపర యుగాలకు చెందిన వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు.కాగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తమిళనాడు దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి శ్రీవారికి సమర్పించారు.కాగా సారెను ఆలయంలోకి తీసుకెళ్లే సమయంలో మహద్వారం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. తొలుత సారెతో పాటు పదిమందికి అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో శ్రీవారి ఆలయ జీయర్‌స్వామి,మంత్రి శేఖర్‌బాబుతో పాటు పదిమంది మహద్వారం గేటులోకి ప్రవేశించగానే భద్రతాసిబ్బంది గేటు మూసివేశారు. దీంతో దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్ దంపతులు ఆలయం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది.మంత్రి శేఖర్‌బాబు గుర్తించి తిరిగి గేటు వద్దకు చేరుకుని ఆలయంలోకి అనుమతించాలని విన్నవించారు. అనంతరం కుమార గురుబాలన్‌ను మహద్వారం నుంచి అనుమతించి ఆయన సతీమణిని బయోమెట్రిక్ నుంచి అనుమతించారు. శ్రీరంగ నుంచి వచ్చిన వారిలో ఇద్దరు ముందుగా మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడంతో సమస్య తలెత్తినట్టు అధికారులు గుర్తించారు.



బస్టాండ్ కాదు.. గుంతల స్టాండ్..!



రొంపిచెర్ల బస్టాండ్‌లో గంతలు

రొంపిచెర్ల, జూలై16: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో గుంతల్లో నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బస్టాండుకు చిత్తూరు, పీలేరు, పుంగనూరు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు వస్తుంటాయి. అయితే బస్టాండు ప్రైవేటు వాహనాలు, ఆటోలతో నిండి ఉంటుంది. ఇక సంత రోజు దుకాణాలతో నిండిపోతోంది. వర్షం పడితే గుంతల్లో నీరు చేరిపోతుంది. ప్రయాణికులు బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా బురద తొక్కాల్సిందే. అధికారులు స్పందించి బస్టాండులోని గుంతలు పూడ్చాల్సి ఉంది. అలాగే గానుగచింత- రొంపిచెర్ల మార్గంలో ప్రభుత్వ అస్పత్రి సమీపంలో రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డునూ బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టుబడ్డ మద్యం ధ్వంసం



గుడుపల్లె, జూన్ 16: గుడుపల్లె మండలంలో అక్రమ రవాణాలో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని మంగళవారం ధ్వంసం చేశారు. కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు 10,582, 1554 లీటర్ల మద్యం పలుదాడుల్లో స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.4,79,442 ఉంటుంది. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కుప్పం డీకే పల్లె చెరువు సమీపంలోని మున్సి పాల్ డంపింగ్ యార్డులో ఎక్స్‌కవేటర్‌తో ఈ మద్యాన్ని ధ్వంసం చేశారు.

సాంకేతిక మార్పులపై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ



కుప్పం, జూలై 16: కుప్పం డిలోని ఆర్టీసీ డ్రైవర్లకు డ్రైవింగ్ పద్ధతులు, వాహనాల డ్రైవింగ్‌లో వచ్చిన అత్యాధునిక సాంకేతిక మార్పులపై అశోక్ లేలాండ్‌కు కంపెనీకి చెందిన సర్వీసు ఇంజినీరు కె.మురళీకృష్ణ మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఆర్టీసీ కొనుగోలు చేసిన తమ కంపెనీ బస్సుల్లోని సాంకేతికపై డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. కేఎంపీఎల్ పెంచడానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న తులసీనాథ్

కుప్పం, జూలై 16: నియోజక వర్గంలో నడుస్తున్న అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా శాంతి పురం మండలం సి.బండపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలో నిర్వహిస్తున్న అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు క్వారీ కేవలం 500ల మీటర్ల దూరంలో ఉందన్నారు. క్వారీవల్ల పిల్లల ప్రాణాలకు, ఆరో గ్యాలకు ప్రమాదమని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సర్వే నెంబర్ 258, 59లో క్వారీ అక్రమంగా నడుస్తోందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మొక్కలు నాటుతున్న డాక్టర్ అనౌఖ్య

పలమనేరు, జూలై16 : పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించినపుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని కొలమాసనపల్లి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అనౌఖ్య పేర్కొన్నారు. మంగళవారం కొలమాసనపల్లి వసతి గృహంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ, బోధకాలు వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వసతి గృహ ఆవరణలో మొక్కలు నాటారు.

బీఎల్ఓలకు ఎన్నికల భత్యం ఇప్పించండి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీఓ సంఘం నాయకులు

పలమనేరు, జూలై16: పలమనేరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న బీఎల్‌ఓలకు ఎన్నికల భత్యం ఇప్పించాలని మంగళవారం పలమనేరు ఎన్జీఓ సంఘ నాయకులు, సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు ఆర్డీఓ మనోజ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇతర నియోజకవర్గాల్లో భత్యం అందజేశారని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని నిధులు మంజూరైన వెంటనే చెల్లిస్తామని ఆర్డీఓ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ ఎన్జీఓ సంఘ నాయకులు ఆనందబాబు, లక్ష్మీపతియాదవ్, సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, జిల్లా అధ్యక్షులు రమణ, నాయకులు దామోదరనాయుడు, వెంకటాచలపతినాయక్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఎన్నికలు కొనసాగుతాయ్



సుభాష్‌చంద్రబోస్

పలమనేరు, జూలై16 : పలమనేరు సూపర్ బజార్ ఎన్నికలు కొనసాగుతాయని సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఆమేరకు మంగళవారం ఆయన పలమనేరు సూపర్ బజార్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సూపర్‌బజార్ పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో ఎన్నికల నిర్వహణ అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేసి రిటైర్డు అయిన బి.వెంకటరమణను పాలకవర్గం నియమించిందన్నారు. జూలై 10న సూపర్ బాజార్‌కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టు నాలుగున ఎన్నికలు జరిపేందుకు వెంకటరమణ అప్పట్లో సిద్ధపడ్డారన్నారు. అయితే జూలై 1న తాను ఎన్నికల నిర్వహణ చేసేందుకు సుముఖంగా లేనని పేర్కొంటూ సూపర్‌బజార్ పాలకమండలికి, జిల్లా సహకార శాఖ అధికారులకు ఆయన లేఖ రాశారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జూలై 6న జిల్లా సహకార శాఖ అధికారులు జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను సూపర్ బజార్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని వివరించారు. స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై తాను రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. విచారణ జరిపిన కోర్టు స్పెషల్ ఆఫీసర్ నియామకపు జీఓను రద్దు చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ఎక్కడ ఆగిందో అక్కడినుంచి కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీంతో సూపర్ బజార్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుం దన్నారు. స్పెషల్ ఆఫీసర్ జీవో రద్దు చేయడంతో మళ్లీ పాలక వర్గం బాధ్యతలు తీసుకుందని బోస్ వివరించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రేపు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల వేదిక

కుప్పం, జూలై 16: కుప్పం మండల సచివాలయంలో ఈ నెల 18వ తేదీ గురువారం ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలల్లో మొలాథిన్ పిచికారీ



కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాలలో మొలాథిన్ పిచికారీ

బైరెడ్డిపల్లె, జూలై 16 : మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో దోమల నివారణకు బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ సిబ్బంది అబేట్, మొలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులశుభ్రత, పరిసరాల శుభ్రత పాటించి వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ సేవలపై అవగాహన



డీసీసీబీ బ్రాంచ్ బ్యాంకులో జరిగిన సమావేశం

బైరెడ్డిపల్లె, జూలై 16 : డీసీసీబీ బ్యాంకు బైరెడ్డిపల్లె బ్రాంచ్‌లో మంగళవారం బ్యాంకులో అందిస్తున్న సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బ్యాంకులో డిజిటల్ సేవలందిస్తున్నామని, తక్కువ వడ్డీకి రుణాలంద జేస్తున్నా మని, లాకర్ సౌకర్యం ఏర్పాటుచేశామని వివరించారు. బ్యాంకులో అందుబాటులో ఉన్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకును శుభ్రం చేసుకున్న గ్రామస్తులు



సోమల, జూలై 16: సోమలలోని శెట్టివారివీధిలోని తాగు నీటి ట్యాంకును శుభ్రం చేయక పోవడంతో నీటిలో పురు గులు పడ్డాయి. ఆ నీటిని తాగేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ట్యాంకును శుభ్రం చేయాలని పలుమార్లు అధికా రులను కోరినా పట్టించుకోలేదు. దీంతో మంగళవారం స్థానికులే ట్యాంకును శుభ్రం చేసుకున్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపల విడుదల



కల్లూరు, జూలై 16: దోమల నివారణకు చెరువుల్లో గంబూషియా చేపలు వదులుతున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెరువుల్లో గంబూషియా చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల లార్వాను గంబూషియా చేపపిల్లలు తిని దోమల సంతతిని నిర్మూలిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణయ్య, శారద, షబానా, సరస్వతి పాల్గొన్నారు.

బసవరాజుకండ్రిగలో ఉచిత వైద్యశిబిరం



పెద్దపంజాణి, జూలై 16: మండలంలోని బసవరాజు కండ్రిగలో రాయలపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు మంగళ వారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల జ్వరాలు ప్రబలాయి. దీంతో జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో వైద్యులు అప్రమత్తమ య్యారు. గ్రామంలోని తాగునీటిని శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లించారు. మురుగు నీటి కాలువలు శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, వైద్యులు ఎంపీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఏఎన్ఎం సుజాత, ఎంఆర్‌సి సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ వందశాతం పూర్తిచేయాలి



రాయలపేట పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగవరం, జూలై 16: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పుట్టిన బిడ్డలందరికీ వ్యాక్సినేషన్‌ను వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గంగవరం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఓపి పేషెంట్లకు అందుతున్న వైద్యం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గంగవరం పరిధిలో ఉన్న పీహెచ్ సీలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో గత 3 నెలలలో 109 కాన్పులు జరిగాయన్నారు. కాన్పులు జరిగిన ప్రతి ఇంటికీ వెళ్లి పుట్టిన బిడ్డలకు సమయం ప్రకారం వ్యాక్సినేషన్ అందిందా లేదా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. అందకపోతే సకాలంలో ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ అందించాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండ లంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. జ్వరాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని గ్రామాలలో తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుధ్య చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు నందిని, మౌనిక, తహసీల్దారు నాగేంద్ర, ఈఓఆర్డీ శారదాదేవి, పంచాయతీ కార్యదర్శి గణపతి ఉన్నారు.

కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా వి.శ్రీనివాసరావు

కుప్పం, జూలై 16: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా వి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఉంటూ ఇక్కడకు బదిలీ అయ్యారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంటుగా ఉన్న శ్రీనివాసరావు గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ (ఎఫ్‌ఏసీ)గా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆయనను కుప్పం మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా బదిలీ చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రెగ్యులర్ కమిషనర్ నియామకం జరిగేవరకూ వి.శ్రీనివాసరావు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.నాగేశ్వరరావు రెండు రోజుల సెలవులో వెళ్లారు. ఆయన కూడా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంటుగా ఉంటూ ఎన్నికల ముందు కుప్పం వచ్చారు. ఇటీవల నాగేశ్వరరావు మీద హిమబిందు అనే మహిళ వేధింపుల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తన ఇంటికి దారి సమస్యపై కమిషనర్ నాగేశ్వరరావును కలిసినప్పుడు ఫోన్‌లో వేధించారంటూ ఆమె కుప్పంలో ఈ నెల 6వ తేదీన ఆందోళనకు సైతం దిగారు. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో సెలవులో ఉన్న నాగేశ్వరరావుకు తిరిగి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంటుగా అయన మాతృ సంస్థలో విధుల్లోకి తీసుకుంటారా లేక మరెక్కడైనా పోస్టింగ్ ఇస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సైబర్ క్రైం పట్ల అవగాహన ఉండాలి : డీఎస్పీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణురఘువీర్

వి.కోట, జూలై 16: విద్యార్థులు సైబర్ క్రైం పట్ల అవగాహన కల్గి అప్రమత్తంగా ఉండాలని పలమనేరు డీఎస్పీ విష్ణు రఘువీర్ అన్నారు. మంగళవారం వి.కోటలోని పీఎం ఆర్ కళ్యాణ మండపంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికతో చదువును కొనసాగించి ఉత్తమ పౌరులుగా ఎదిగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. మొబైల్స్ వినియోగంతో విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో కొంత మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారని అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే విద్యార్థులు చిన్న వయస్సులోనే ప్రేమవివాహాలు చేసుకుని ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. సీఐ లింగప్ప, ఎస్ఐ బాబు, పట్టణంలోని వాణి, నలంద, విద్యానికేతన్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ టీడీపీలో గౌరవం: చల్లా బాబు



నాయకులతో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, జూలై16: పుంగనూరు నియోజకవర్గంలోని ప్రతి నాయకునికీ, కార్యకర్తకూ తగిన గుర్తింపు, గౌరవం దక్కుతుందని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం పుంగనూరు మాజీ జడ్పీటీసీ రమాదేవి చల్లాబాబును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సోమల- పెద్దఉప్పరపల్లె రోడ్డును బాగుచేయాలని సోమల మండల నాయకులు చల్లాబాబు దృష్టికి తెచ్చారు. అలాగే వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. దీనిపై చల్లాబాబు స్పందిస్తూ పార్టీ కోసం కష్టపడిన వారిని ఎప్పటికీ మరచిపోనని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం



కలశ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

పుంగనూరు రూరల్, జూలై 16: వారాహి నవ రాత్రుల సందర్భంగా పుంగనూరు ప్రసన్న పార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా వేదపండితులు వారాహి హోమాన్ని జరిపారు. స్థానిక ఆలయంలో సప్తమాతృ కలలో ఒక్కరైన వారాహి అమ్మవారికి వేదపండితులు షణ్ముకదీక్షితులు, విశ్వేశ్వరయ్య, నాగేంద్రలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి హోమం చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, కలశస్థాపన నిర్వహించి వారాహి అమ్మవారికి కలశాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతులు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి



నాటేందుకు మొక్కలతో సిద్ధంగా ఉన్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, జూలై 16: ప్రతి విద్యార్థి నాటిన మొక్కలను పరిరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాలని నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూల్ ఏజీఎం రవీంద్ర పణికుమార్ సూచించారు. మంగళవారం స్థానిక నారాయణ స్కూల్ ఆవరణలో 'పచ్చదనాన్ని పెంచుదాం' అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లవద్ద మొక్కలు నాటి వాటిని కాపాడేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఆర్ఐ ప్రసాద్, కో-ఆర్డినేటర్లు శ్రీకాంత్, రేవతి, రూప, శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న పలమనేరు మండల సమావేశం

పలమనేరు, జూలై16 : పలమనేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీ ఎంపీపీ రోజా అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ రాజేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

చిన్నశేషుడిపై శ్రీవారి విహారం



సోమల, జూలై 16: మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం చిన్నశేష వాహనంపై శ్రీవారు విహరించారు. మూల విరాట్‌కు విశేష పుష్పాలంకరణలు జరిపారు. ఉదయం ఉత్సవ మూర్తులకు నవకలశస్నపనం, అభిషేకపూజలు అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయ దారులు తోకల గిరిజమ్మ, రమేశ్‌నాయుడు ఊంజల్ సేవ ఉత్సవమూర్తులకు వెండితో తయారు చేయించిన మూడు నూతన కిరీటాలు కానుకగా సమర్పించారు.

నేడు కమ్మపల్లెకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం గరుడసేవ జరగనుంది. ఈ సేవలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామ చంద్రారెడ్డి, టీడీపీ నాయకులు హాజరవుతున్నట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేశ్‌నాయుడు తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో షౌకత్ ఆలీ

కల్లూరు, జూలై 16: పులిచెర్ల మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు మరింత వేగవంతం చేయాలని ఏపీవో షౌకత్ ఆలీ తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం, దేవళంపేట పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. ఫారంపాండ్, సరిహద్దు కందకాలు, సప్లై చానెల్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్ఏలు శారద, రాజగోపాల్, కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా మోహర్రం వేడుకలు

రొంపిచెర్ల,జూలై16: మండలంలోని కస్పాపేటలో మోహర్రం పండుగ సందర్భంగా పీర్లచావడిలో పీర్లు ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా పీర్లను పూలతో అలంకరించి బూంది, చక్కెర పెట్టి చదివింపులు చేశారు. రాత్రి పీర్లను ఊరేగించారు.

పరిశుభ్రత పాటించాలి

సదుం, జూలై 16: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సదుం పీహెచ్‌సీ వైద్యులు డా.చరణ్ సూచించారు. మంగళవారం చెరుకువారిపల్లెలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వల ద్వారా దోమలు వృద్ధి చెంది తద్వారా వచ్చే జ్వరాల బారిన పడకుండా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని తెలిపారు. అనంతరం నీటి కుంటల్లో గంబూషియా చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు విద్యాసాగర్, నీలకంఠ, శిఖామణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నంజంపేట రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు

సోమల, జూలై 16: రహదారులపై గుంతలు పూడ్చేందుకు, మరమ్మతులు చేసేందుకు జిల్లా అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇందులో సోమల - నంజంపేట, పెద్దఉప్పరపల్లె రోడ్డు పనులకు రూ.17లక్షలు, నంజంపేట నుంచి చెరుకు వారిపల్లె మీదుగా సదుం రోడ్డుకు రూ. 4.50 లక్షలు, కందూరు - నగిండ్లు రోడ్డు పనులకు రూ. 9.50 లక్షలు అవసరమని నివేదికలు పంపారు. ఐదేళ్లగా సోమల - నంజంపేట, పెద్దఉప్పరపల్లె రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు.

నష్టపరిహారం పెంచాలి



బైరెడ్డిపల్లె, జూలై 16 : బైరెడ్డిపల్లెలో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించి మంగళవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఆర్డీవో మనోజ్‌రెడ్డి రైతులతో సమావేశమ య్యారు. బైపాస్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. బైపాస్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కొందరు, తమకు ఇస్తున్న నష్టపరిహారాన్ని మరింత పెంచాలని మరికొందరు, భవనాలు, కట్టడాలు కోల్పోతే తమకు ప్రత్యామ్నాయం చూపాలని ఇంకొందరు కోరారు. తహసీల్దార్ స్వర్ణలత, వీఆర్వోలు పాల్గొన్నారు.

1998 ఎంటీఎస్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు వినతి పత్రం అందజేస్తున్న 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు

పలమనేరు, జూలై16 :తమ సమస్యలు పరిష్కరించాలని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయలు కోరారు. ఈ మేరకు మంగళవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జయప్రకాష్ నాయుడు, రామయ్య, రెడ్డిరమేష్ బాబులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంటీఎస్ టీచర్లు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నెలలో తమను కాంట్రాక్టు టీచర్లుగా ప్రభుత్వం విధుల్లోకి తీసుకొందన్నారు. అయితే ఉద్యోగ విరమణ వయస్సు 60 సంవత్సరాలుగా ఉన్నందున చాలామంది తక్కువ సమయంలోనే ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఈవిద్యాసంవత్సరంలో అనేక మంది రిటైర్‌కానున్నారని చెప్పారు. అందువల్ల తమకు ఉద్యోగ విరమణ వయస్సు అందరిలాగే 62 సంవత్సరాలు చేయాలని, 12నెలల జీతం రెగ్యులర్ సర్వీసు కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ తప్పక సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1998 ఎంటీఎస్ ప్రతినిధులు ఏఆర్.కుమార్, రోషన్, ఆలీఖాన్, సదాశివ, సూర్యప్రకాష్, ర మేష్, గిరిధరమూర్తి, వెంకటముని, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

జీపీఎస్ గెజిట్ నిలుపుదలపై హర్షం

చిత్తూరు (సెంట్రల్), జూలై 16: గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్)పై విడుదలైన గెజిట్‌ను ప్రభుత్వం నిలుపుదల చేయడంపై ఆపస్ హర్షం వ్యక్తం చేసింది. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లావాసి బాలాజీ, నాయకులు రఘునాథ్, సతీష్‌లు మంగళవారం విజయవాడ విద్యాభవన్‌లో పాఠశాల జేడీ (సర్వీసెస్) మువ్వ రామలింగంను కలిసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జీపీఎస్ గెజిట్‌ను నిలుపుదల చేసి ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని జేడీకి విజ్ఞప్తి చేశారు. 117 జీవో రద్దు చేసి ఇటు విద్యార్థులకు అటు ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చాలంటూ ఆయనకు వినతి పత్రం సమర్పించారు.

భక్తిప్రపత్తులతో ఆషాడ మాస పూజలు



చిత్తూరు కల్చరల్, జూలై 16: స్థానిక పొన్నియమ్మ గుడిలో మంగళవారం అమ్మవారికి ఆషాడమాస పూజలను భక్తులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ సీకే లావణ్యబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి మహాకుంభం సమర్పించి స్తోత్ర పారాయణం చేశారు. అమ్మవారికి సమర్పించిన కుంభ నైవేద్యాన్ని భక్తులు సామూహికంగా ఆరగించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మకు పొంగళ్లు



శ్రీరంగరాజపురం, జూలై 16: ఎస్ఆర్‌పురం మండలం 49. కొత్తపల్లె మిట్టలో గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం మహిళలు ఆరిమాని గంగమ్మకు పొంగళ్లు తీసుకెళ్లారు. అమ్మవారికి నైవైద్యం సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక

నగరి : నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్ఎఫ్ కంపెనీ వారు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో మంగళవారం 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. 31 మంది విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించగా అందులో 28 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

కుటుంబ సభ్యులను తలచుకుని ఆటోలు నడపండి

డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు డీఎస్పీ రాగోపాల్‌రెడ్డి, పాల్గొన్న ఆటో డ్రైవర్లు

చిత్తూరు, జూలై 16: ఆటో వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న డ్రైవర్లు... ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వాహనాలు నడిపేటప్పుడు కుటుంబ సభ్యులను తలచుకుని నడపాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు సంబంధించిన లైసెన్సులు, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్లను పెట్టుకుని వాహనాలను నడపాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఆపకుండా నిర్ణయించిన స్టాండ్ల వద్ద మాత్రమే ఆటోలను ఆపాలన్నారు.ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి ఆటో డ్రైవర్లు ముందుకు రావాలన్నారు. తాగి వాహనాలను నడిపితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, రెండో పట్టణ సీఐ ఉలసయ్య పాల్గొన్నారు.

పాల రేటు తగ్గిందని ఆందోళన చెందకండి

జిల్లా వెటర్నరీశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్



పాడిరైతుకు మినరల్ మిక్సర్ ప్యాకెట్‌ను అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్

గంగాధరనెల్లూరు, జూలై 16: వర్షాలు కురుస్తున్నందున పాల రేటు తగ్గిందని రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరంలేదని జిల్లా వెటర్నరీశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు మండలం నందనూరులో వెటర్నరీ సెంటర్ వద్ద మంగళవారం పాడి ఆవులకు గర్భకోశ వ్యాధులు, వాటి నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వర్షాలు వల్ల పచ్చిక ఎక్కువగా అందుబాటులో ఉన్నందున వేసవిలో కంటే పాడిఆవులు పాలు ఉత్పత్తి అధికంగా ఇస్తుందని, దీంతో ప్రభుత్వ బీఎంసీలు, ప్రైవేటు డెయిరీలు రేటు తగ్గించాయని రైతులు నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. పాల రేటు తగ్గిపోవడం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి బీఎంసీలతో పాటు ప్రైవేటు డెయిరీల యాజమాన్యాలతో చర్చించి రేటు పెంపు విషయంపై త్వరలో రైతులకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పాడి ఆవులకు మినరల్ మిక్సర్‌తోపాటు దానికి తగినట్లుగా దాణానే మేతగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 53 పాడిఆవులకు గర్భకోశ చికిత్సలు, 22 పాడి ఆవులకు సాధారణ చికిత్సలు, 78 దూడలకు నట్టలనివారణ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పుత్తూరు ఉప సంచాలకులు గోవిందయ్య, గంగాధరనెల్లూరు సహాయ సంచాలకులు మురళిమోహన్, వెటర్నరీ డాక్టర్లు నాగాంజనేయులు, యశస్వి, శ్రీనాథ్, పలువురు వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కమ్మతిమ్మాపల్లిలో వైద్య శిబిరం

గుడిపాల, జూలై 16: కమ్మతిమ్మాపల్లిలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంజీవిని ఐ కేర్ హాస్పిటల్, మనోరమ హాస్పిటల్, మహేష్ హాస్పిటల్ వారు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు.

అంబేడ్కర్‌కు ఎమ్మెల్యేల నివాళి



చిత్తూరుసిటీ, జూలై 16: పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం నాగపూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమాధికి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాంగ పదవులు, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారంటే అది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంవల్లేనని కొనియాడారు.

బాలికల హాస్టల్ తనిఖీ

గుడిపాల, జూలై 16: గుడిపాల ఎస్సీ బాలికల హాస్టల్‌ను మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సంధ్య తనిఖీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, సులోచన, జబశెల్వి, చంద్రశేఖర్, ఉమ, సుజిమ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు అనుమతులివ్వాలి : సీపీఐ

నగరి జూలై 16: నగరి నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఇచ్చిన క్వారీ లైసెన్సులను రద్దు చేసి ఇసుకరీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన ఆ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. కోదండయ్య మాట్లాడుతూ మట్టి, ఇసుక అక్రమ రవాణాలను అరికట్టాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ అధికారులను ఆదేశించడం అభినందనీయమన్నారు. మట్టి క్వారీలను సర్వే చేసి అక్రమాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో నాగరాజకుప్పం వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులు అందజేయాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చిత్తూరు, జూలై 16: మహిళలు తమ హక్కులను రక్షించుకోవడానికి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సెబ్ ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. మంగళవారం స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలపై అన్యాయాలు, నివారణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఐటీపీఏ, పోక్సో తదితర చట్టాల గురించి క్షుణ్ణంగా వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసుశాఖ ముందుంటుందన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, గృహ హింస, లైంగికదాడి, అసభ్యకర ప్రవర్తన వంటి అనేక రూపాల్లో ఉండవచ్చని వివరించారు. అనంతరం విద్యార్థినిల చేత మహిళల హక్కుల కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నగరి అభివృద్ధి గురించి సీఎంతో చర్చించిన భానుప్రకాష్



నగరి జూలై16: నగరి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, ప్రజా సమస్యల గురించి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరి నియోజకవర్గాన్ని దోచుకున్నారే గాని అభివృద్ధి పనులు జరగలేదని తెలిపారు. టీడీపీ హయాంలో నగరి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు

గంగాధరనెల్లూరు, జూలై 16: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ముందస్తుగా హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. గంగాధరనెల్లూరు బాలుర, బాలికల హాస్టల్స్‌లోని విద్యార్థులకు మంగళవారం పలువురు వైద్యసిబ్బందితో కలిసి డాక్టర్ వైద్యపరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యువో షకీలా, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, హాస్టల్ వార్డన్లు శాంతరాజ్, రమాదేవి, ఆశవర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

18 నుంచి కుష్ఠువ్యాధి గుర్తింపు సర్వే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, జూలై 16: ఈనెల 18వ తేది నుంచి నిర్వహిం చాల్సిన ఇంటింటి కుష్ఠువ్యాధి గుర్తింపు సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి వైద్యసిబ్బందిని ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో ప్రతి ఒక్కరిని స్క్రీనింగ్ చేయాలని, అనుమానంగా ఉన్న మచ్చలను గుర్తించి పరీక్షలకు పంపించాలన్నారు. ఎవరికైనా కుష్ఠు ఉందని నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు మందులు వాడితే నయం అవుతుందన్నారు. సర్వే చేసిన డేటా ను రోజూ వారిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆశలు, వలంటీర్లు రెండు టీమ్‌లు గా సర్వేలు చేయాలన్నారు. ఈ సర్వేలు ఆగస్టు 2వ తేది వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికాని వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యం నివారించండి

చిత్తూరు రూరల్, జూలై16: ఉగ్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యాన్ని నివారించాలని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఎస్టీయూ నాయకులు మదన్మోహన్‌రెడ్డి, మోహన్ యాదవ్‌లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో బిల్లుల మంజూరులో కొర్రీలు పెట్టి బిల్లులు పెండింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి వెంటన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్, నాయకులు యువరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పట్ల అవగాహన కల్పించాలి

వెదురుకుప్పం, జూలై 16: పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాల పట్ల ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలియజేశారు. మంగళవారం వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. డీడీవో ధనలక్ష్మి, సర్పంచ్ బండి శశిఆనందరెడ్డి, ఉద్యోగులు హాజరయ్యారు.

మంత్రి కొల్లురవీంద్రను కలిసిన బీసీ నాయకులు

గంగాధరనెల్లూరు, జూలై 16: రాష్ట్ర గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీకి చెందిన పలువురు బీసీ నేతలు విజయవాడలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. టీడీపీ మండల బీసీ అధ్యక్షుడు జ్యోతియాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీ కులాల వారికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, ముద్దుకృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహరం

చిత్తూరు కల్చరల్, జూలై 16: ముస్లింలకు పవిత్రమైన మొహరం పండుగను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రి సమీపంలోని పీర్ల మకాన్, శేషాపిరాన్ వీధి, ఓబనపల్లె, మంగసముద్రం, ప్రశాంత్‌నగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లెప్రాంతాలలో ముస్లింలు మేళతాళలతో పీర్లను ఊరేగించారు. అనంతరం స్థానికంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అగ్నిగుండాల్లో భక్తులు నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం పీర్లకు జలాభిషేకం నిర్వహించనున్నారు,

ముస్లింలకు ఎస్పీ మొహరం శుభాకాంక్షలు

చిత్తూరు, జూలై 16: జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ మణికంఠ చందోలు మొహరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతి, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల కోసం 14 శతాబ్దాల క్రితం జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరుల సంస్మరణే మొహరం అన్నారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని, ఈ పండగను భక్తిభావంతో జరుపుకోవాలన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే మోహరం శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, జూలై 16: ముస్లింలకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మొహరం త్యాగం, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు.

ఆలయంలో ఆణివార ఉత్సవం



కార్వేటినగరం, జూలై 16: కార్వేటినగరం టీటీడీ వేణు గోపాలస్వామి ఆలయంలో ఆణివార ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయంలో విశేష పూజలు



కార్వేటినగరం, జూలై 16: కార్వేటి నగరం బంగారమ్మ ఆలయం లో మంగ ళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహిం చారు. గ్రామదేవత బంగారమ్మను అలంకరించారు. భక్తులు అమ్మవారికి నైవేద్య కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



చిత్తూరు కలెక్టరేట్, జూలై 16: స్థానిక సంతపేట బండ్లవీధిలో నివసిస్తున్న హెచ్. టింపుల్(6వ తరగతి)కి కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.25వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈనెల ఒకటో తేదిన జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆ విద్యార్థిని టింపుల్ కలెక్టర్‌ను కలిసి తన తల్లిదండ్రులిద్దరూ మరణించారని, ప్రస్తుతం తాను పెద్దమ్మ జయలక్ష్మి సంరక్షణలో ఉంటున్నానని తెలిపారు. తన విద్య, వైద్య ఖర్చులను వారే చూస్తున్నారని పేర్కొంది. వారి జీవనం కూడా కష్టతరంగా ఉన్న దృష్ట్యా తనకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విద్యార్థిని కోరింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద రూ.25వేలు ఆర్థిక సాయం మంజూరు చేస్తూ చెక్‌ను టింపుల్ పెద్దమ్మ జయలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని టింపుల్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ,ఎస్టీ డ్వాక్రా మహిళలకు చంద్రబాబు చేయూత

చిత్తూరు సిటీ, జూలై 16: ఎస్సీ, ఎస్టీ డ్వాక్రా మహిళలకు సీఎం చంద్రబాబు ఆర్థికంగా చేయూత నిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం ఇవ్వనుండడంతో ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

నింద్ర, జూలై 16: నింద్రలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం నగరి ఆర్డీవో తనిఖీ చేశారు. తచ్చూరు-బెంగుళూరు హైవేలో భాగంగా నింద్ర మండలం అత్తూరు వద్ద వెళ్లే రోడ్డుకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. సోమవారం అత్తూరుకు చెందిన రైతులు కొంతమంది గ్రీవెన్స్‌లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ఆర్డీవో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ, వీఆర్‌వోలు ఉన్నారు.

19 నుంచి ఆడిమాస పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 16: నగరంలోని తమిళులు ఈనెల 19నుంచి ఆడినెల పూజలు నిర్వహించనున్నారు. 19వ తేది తొలి ఆడి శుక్రవారం సందర్భంగా గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి పుష్పాలంకరణ, పూజలు నిర్వహించనున్నామని అర్చకులు బి. కె. కుమార్ తెలిపారు. చవటపల్లె కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి వేపాకుతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నామని అర్చకులు నాగభూషణం తెలిపారు.

నేడు తొలి ఏకాదశి పండుగ

చిత్తూరు, కల్చరల్, జూలై 16: నగరంలోని ఆలయాల్లో భక్తులు బుధవారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించనున్నారు. హైందవ సంప్రదాయంలో ఆషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశితో హిందూ పండుగలు ప్రారంభం అవుతాయని పండితులు అభిప్రాయం. నగరంలోని అన్నీ ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి నిర్వహించడానికి ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

పెనుమూరు,జూలై16: పులికల్లు పంచాయతీ బుద్దారెడ్డిపల్లి, మణియానంపల్లి గ్రామాల్లో మంగళవారం మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని పంచాయతీ కార్యదర్శి శ్రీలత కూలీల ద్వారా తీయించారు. వీధుల్లో శానిటేషన్, బ్లీచింగ్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వాటర్‌ట్యాంకుల పరిశుభ్రతలను పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, ప్రజలు పాల్గొన్నారు.

డెంగ్యూ, డయేరియాపై అవగాహన

వెదురుకుప్పం,జూలై16: డెంగ్యూ, డయేరియాపై విద్యార్థులకు అవగాహన ఉండాలని పచ్చికాపల్లం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం వెదురుకుప్పం బాలికల హాస్టల్, పచ్చికాపల్లం బాలుర హాస్టల్ విద్యార్థులకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు.